# నా సాహితీ జీవనంలో జరిగిన కథ

## మల్లాది వెంకట కృష్ణమూర్తి



కేవలం 'కౌముది' పాఠకుల కోసమే మల్లాది గారు మొట్టమొదటి సారిగా వ్రాస్తున్న సంచలనాత్మక శీర్షిక

*1970 నుంచి సాహిత్య మార్గంలో నాకు ఎదురైన అనేక సంఘటనలని, అనుభవాలని పాఠకులతో పంచుకోవడానికి ఈ శీర్షికను ఆరంభిస్తున్నాను. తరచూ నన్ను పాఠకులు అడిగే అనేక ప్రశ్నలకి జవాబులు ఇందులో దొరుకుతాయి. నాకు ఈ మార్గంలో పరిచయం ఉన్న అనేకమంది ప్రముఖుల గురించి రాసే వివిధ విషయాలు, వారితో నా అనుభవాలు చదవడానికి పాఠకులకి ఆసక్తిగా ఉంటాయని విశ్వసిస్తున్నాను. నాకు డైరీ రాసే అలవాటు లేదు కాబట్టి తారీఖులు, నెలలు, సంవత్సరాలు, కొందరి పేర్లు అన్ని సందర్భాల్లోనూ ఇవ్వలేను. అందుకని కేవలం జరిగిన వాటి సారాంశాలని మాత్రమే ఇవ్వగలను. ఎలాంటి దాపరికాలు లేకుండా రాయదలచుకున్నాను కాబట్టి పాఠకులు దీన్ని కల్పితంగా భావించనవసరం లేదు. ఏ విషయం మీదైనా వారు ఇంకాస్త వివరాలు తెలుసుకోడానికి ప్రశ్నలు వేయచ్చు. అలాగే ఏ విషయం మీద తెలుసుకోవాలని ఉందో దాన్ని అడిగితే ఆ వివరాలు రాస్తాను. అయితే ఓ టాపిక్కు ముగిసేదాకా ఆగి దాని మీద నేను చెప్పనివాటి గురించి అడిగితే ఎవరికీ సమయం వృథాకాదు. మీరు టాపిక్కులని సూచించవచ్చు. నేను రాయదలచుకున్న జాబితాలో అవి ఉంటే సరే. లేకపోతే మిగతా పాఠకులకి, నాకు ఈ విషయంలో సహాయం చేసినవారు అవుతారు. అనుమానం ఉన్న సంగతులని వదిలేయదలిచాను కాని అసత్యాలని మాత్రం రాయదలచుకోలేదు. కొందరికి ఇవి బాధని కలిగించవచ్చు. కాని సత్యానికి దగ్గరగా ఉండాలంటే ఇది తప్పదు.*

\- మల్లాది

"Of the writers I know who own mansions, all of them could paper the outside of their house with rejection letters."

---John Long

# వేమూరి బలరాం



**స్వాతి మంత్లీని వేమూరి బలరాం, వేమూరి సత్యనారాయణ, నాగేశ్వరరావులు హైదరాబాద్‌లో ఆరంభించారు.** దాని ఎడిటర్ శీలా వీర్రాజుగారు. అప్పట్లో నాకు దాని భాగస్వాముల్లో ఎవరితో పరిచయం లేదు. తర్వాత బలరాం స్వాతి మంత్లీని మిగిలిన భాగస్వాముల నుంచి కొని దాన్ని విజయవాడకి మార్చాక పరిచయం అయింది.

విజయవాడలో గవర్నర్ పేటలో, బీసెంట్ రోడ్డు సమీపంలోని ప్రకాశం రోడ్‌లో, అద్దెకి తీసుకున్న ఓ భవంతిలోని గ్రౌండ్ ఫ్లోర్‌లో స్వాతి కార్యాలయం ఉండేది. 1970లలో స్వాతి మంత్లీలో నా కథలు కొన్ని వచ్చాయి. ఓసారి విజయవాడలోని వారి కార్యాలయానికి చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న ఓ కథని గురించి తెలుసుకోడానికి వెళ్ళాను. అదే నాకు బలరాంగారితో తొలి పరిచయం. దాన్ని తాము తిప్పి పంపామని బలరాం చెప్పారు కానీ అది పోస్టులో మిస్ అయి ఉంటుంది. నాకు అందలేదు. ఆయన ఆప్యాయంగా మాట్లాడారు. ఆ తర్వాత ఎప్పుడు కలిసినా ఆప్యాయంగా మాట్లాడటం కొనసాగింది. అందరితో ఆయన మాట తీరు అలాగే ఉండేది.

ఓసారి విజయవాడకి వెళ్ళినప్పుడు దిన పత్రికలో గవర్నర్ పేటలోని నటరాజ్ హోటల్‌లో 'దొంగలున్నారు జాగ్రత్త' అనే సినిమా షూటింగ్ జరుగుతోందని, ఆదివిష్ణు రచయితని, చదివాను. ఆయన నాకు పరిచయం కాబట్టి ఆ హోటల్‌కి వెళ్ళి ఆదివిష్ణుని కలిశాను. ఓ గదిలో పగలే ఆదివిష్ణు ఫ్రెండ్స్‌తో మందు కొడుతున్నారు. జయకుమారి అనే వేంప్ టైప్ నటితో, ప్రసాద్ బాబుతో రూఫ్ గార్డెన్ మీద ఓ క్లబ్ సాంగ్ చిత్రీకరణ జరుగుతోంది. ఆర్టిస్ట్ రంగనాథ్ నాకు అక్కడే పరిచయం. స్వతహాగా కవి అయిన అతనికి రచయితలంటే అభిమానం. అక్కడికి బలరాం కూడా వచ్చారు.

ఆ రాత్రి స్వాతి కార్యాలయానికి రాత్రి ఏడున్నరకి ఆదివిష్ణుని పిలుస్తూ బహుశా మర్యాదకి అనుకుంటా పక్కన ఉన్న నన్ను, నా మిత్రుడు, రచయిత దేవరకొండ మురళీని కూడా పిలిచారు. ఎందుకంటే మమ్మల్ని బలరాం పిలిచేంత సాన్నిహిత్యం మాతో ఆయనకి లేదు. రాత్రి స్వాతి మంత్లీ కార్యాలయంలో బలరాం లిక్కర్ పార్టీ ఇచ్చారు. మేం ఇద్దరం వెళ్ళాం. నా అభిమాన రచయిత పెద్దిభొట్ల సుబ్బరామయ్య గారు, మరి ఒకరిద్దరు రచయితలు నాకు అక్కడే పరిచయం. మాకు కూడా మర్యాదకి కొంత విస్కీ లభించింది. ఆ రోజు ఆదివిష్ణు కౌబాయ్ తరహా నవలని స్వాతి మాసపత్రికలో సప్లిమెంట్‌కి నవలగా రాస్తానని చెప్పారు. అది తర్వాత స్వాతి మంత్లీలో వెలువడింది. ఆ వారమే మురళీ కథ ఆంధ్రప్రభ వీక్లీలో వచ్చింది. స్వాతి మంత్లీకి కూడా ఓ కథ ఇమ్మని మురళీని బలరాం అడిగారు.

బలరాం ఎడిటర్‌గా కూర్చునే కుర్చీలో కూర్చోకుండా నుంచునే తాగుతూండటం గమనించి అడిగాను.

"మీరు ఈ కుర్చీలో కూర్చుని డ్రింక్ తీసుకోరా?"

"ఊహూ. అది పని దేవత. అందులో ఎలా కూర్చుంటాను? గుడ్ అబ్జర్వేషన్." చెప్పారు బలరాం.

పనిని పూజగా, దైవంగా కొలవడం అనేది ఉందని విన్నాను. కాని దాన్ని స్వయంగా చూసి తెలుసుకోవడం అదే నాకు మొదటిసారి. ప్రాణం, రూపం లేని పనిని దైవంగా భావించే సంస్కృతి బలరాంలో ఈనాటికీ అంతే గాఢంగా కొనసాగుతోంది. దేన్నైనా తప్పులేకుండా, సాధ్యమైనంత సమర్థవంతంగా, సమయానికి చేయాలన్నది ఆయన పనికి చేసే పూజ, పాటించే సిద్ధాంతం. దాన్ని ఆయన అక్షరాలా అమలు పరుస్తూ, తన సిబ్బంది చేత కూడా అమలు చేయించడం తర్వాత ఆరంభించిన స్వాతి వీక్లీ విజయానికి గల కారణాలలో ఒకటి. ఈ గుణం పత్రికా రంగంలో మరెవరి దగ్గరా నేను చూడలేదు.



బలరాం కొడుకు అనిల్ చిన్నప్పుడే పోయాడని, అది అతన్ని బాగా బాధిస్తోందని మేం బయటకి వచ్చాక ఆదివిష్ణు చెప్పారు. స్వాతి వీక్లీలో వచ్చే అనిల్ స్వాతిలోని చిన్నపిల్లవాడి ఫోటో అనిల్ దే ఆ చిన్నారిని బుల్లెయ్య చౌదరి అని కూడా పిలిచేవారనుకుంటాను. ఆ పిల్లవాడి మరణం గురించి తను విన్నానని బలరాం స్వగ్రామానికి దగ్గరలోనే మరోగ్రామంలో పుట్టిన కిరణ్‌ప్రభ (కౌముది డాట్ నెట్) చెప్పారు.

కొద్దికాలం తర్వాత స్వాతి మాసపత్రికని అద్దె తక్కువ అనో, లేదా స్వంత భవంతి కొనుక్కునో సూర్యారావు పేటకి షిఫ్ట్ చేసారు. ఇప్పుడు స్వాతి కార్యాలయం ఉన్న భవంతిలోకే మారారని గుర్తు. మారడానికి కారణం బలరాం ఇలా చెప్పిన గుర్తు.

"సెంటర్‌లో ఉంటే రచయితలు తరచు వస్తూండటంతో పని తెమలడం లేదు. దూరంగా ఉంటే పెద్దగా రారని."

1982లో స్వాతి మంత్లీ ప్రకటించిన నవలల పోటీకి నేను పంపిన 'అదిగో పులి' నవల ఎన్నికై సీరియలైజ్ అయింది. ఈనాడు సండే సప్లిమెంట్ కోసం జూపార్క్‌కి ఇంటర్వ్యూకి వెళ్ళినప్పుడు అక్కడ ఇచ్చిన బ్రోషర్‌లో అరుదైన వన్య మృగాల ఫోటోలు ఉన్నాయి. నా దగ్గర ఉన్న ఆ బ్రోషర్‌ని పంపితే సీరియల్‌లో నవల్లోని పాత్రలయిన ఆ మృగాల ఫోటోలు ప్రచురించారు. ఆ రోజుల్లో బొమ్మల ప్రచురణకి బ్లాక్ మేకింగ్ పద్ధతి ఉండేది. అదిగో పులి సీరియల్‌గా వస్తూండగా వీరేంద్రనాథ్ ఓ రోజు నేను పని చేసే ఆఫీస్‌కి ఫోన్ చేసి నాతో చెప్పారు, తను విజయవాడ వెళ్ళినప్పుడు బలరాంని కలిస్తే ఆ నవలకి రెస్పాన్స్ బావుందని చెప్పమని తనతో అన్నారని, తనకి మాత్రం అది నచ్చలేదని. అప్పటికి నాకు వీరేంద్రనాథ్‌తో ముఖ పరిచయం లేదు.

బలరాంగారు నన్ను స్వాతి మంత్లీ సప్లిమెంట్‌కి ఎన్నడూ నవల అడగలేదు. అందువల్ల నేను కూడా పంపలేదు. జ్యోతి, యువ, తరుణ, జయశ్రీలాంటి మాసపత్రికలకి పంపుతున్నట్లే స్వాతి మంత్లీకి కూడా కథలని పంపేవాడిని. నెలకో కథ చొప్పున వరసగా కొన్ని నెలలు స్వాతి మంత్లీలో నా కథలని బలరాం ప్రచురించారు. ఆ రోజుల్లో అది సాధారణంగా ఏ ఎడిటర్ చేయని సాహసమే. తోటి రచయితలకి 'ఎప్పుడూ ఒక్క రచయితవే వేయాలా?' అని భావం కలిగే ప్రమాదం ఉన్నా బలరాం అందుకు వెరవలేదు. తను నమ్మింది ఎవరేమనుకున్నా పాటించే మనస్థత్వం బలరాంది అని దీన్ని బట్టి గ్రహించాను. ఆయనకి పత్రిక విషయంలో ఏదైనా మంచిదని తోస్తే వెరవకుండా దాన్ని ఆచరించేవారు. ఆ రోజుల్లో నెలకో కథని ప్రచురించడం గమనించి నాతో పాజిటివ్‌గా చెప్పింది ఒక్కరే.

"నెలకో కథని రాయడం కష్టం."

ఓ రోజు కేంటిన్ లో కనపడ్డప్పుడు ఏజీ ఆఫీసులో పని చేసే పరుచూరి వెంకటేశ్వరరావు నాతో చెప్పారు. అప్పటికింకా అతను సినిమా రచయిత కాలేదు.

ఇంకా స్వాతి వీక్లీ పెట్టకమునుపు శ్రీ బలరాం ఒకటి, రెండుసార్లు హైదరాబాద్ వచ్చినప్పుడు నాకు ఫోన్ చేస్తే కలిసాను. ఓసారి ఆయన బసచేసిన సరోవర్ హోటల్‌లో. అసెంబ్లీ ఎదురుగా ఉన్న ఆ హోటల్ ఇప్పుడు మెడిసిటి హాస్పిటల్ అయింది. ఆ రెండు సార్లు ఆదివిష్ణు, ఏ.జి.ఆఫీసులో పనిచేస్తూ స్వాతి మంత్లీలో రెగ్యులర్‌గా సినిమా వార్తలని రాసే డి.ప్రభాకర్, వి. రాజారామ్మోహన్ రావు కూడా వచ్చారు. బలరాం బావమరిది ఆయనతో తప్పనిసరిగా ఉండేవారు. ఆయన పేరు గుర్తులేదు. ఎంతో సౌమ్యుడైన అతను మాత్రం లిక్కర్ తీసుకునేవారు కాదు. బలరాంకి నిషా వస్తే ఆవేశంగా ప్రవర్తించేవారు. ఆయనది స్వతహాగా ఆవేశ స్వభావం. ఏదైనా మంచి విషయం చెపితే దాన్ని రిసీవ్ చేసుకోవడం సాధారణంగా కాక పెన్నిధి దొరికినట్లు ఆవేశంగా ఉంటుంది. అది ఆ చెప్పినవారికి సంతోషాన్నిచ్చేలా ఉండే ఆవేశం.

బర్కత్‌పురాలోని ఓ ఇంట్లో నివశించే గిడుతూరి సూర్యం దర్శకత్వం వహించిన 'అమృత కలశం' అనే చిత్రానికి నేను వారి ఇంటికి వెళ్ళి వర్క్ చేసాను. ఆదివిష్ణు దానికి మాటలు రాసారు. సూర్యం సోదరుడు (పేరు గుర్తులేదు) ఏదో స్టేట్ గవర్నమెంట్ ఆఫీసులో పనిచేస్తూ అన్నగారి ఇంట్లోనే ఉండేవారు. ఆయన వివాహం భగ్నం అయిన సమయం అది. ఆయన నాకు బాగా స్నేహితుడు అయ్యారు. సూర్యంగారి భార్య కూడా మరణించడంతో ఆయన అప్పుడే రేవతి అనే, తనకన్నా చిన్నదైన అమ్మాయిని వివాహం చేసుకున్నారు. ఆమెకూడా ఆ ఇంట్లో ఉండేది.

సూర్యంగారి లైబ్రరీలో స్క్రీన్ స్టోరీస్ అనే హాలీవుడ్ నుంచి వెలువడే మాసపత్రికల బైండ్లు చాలా ఉండేవి. ఓ పుస్తకాన్ని తీసుకుని చదివాను. వాటిలో ఆ నెల్లో విడుదలైన చిత్రాల సంక్షిప్త కథలని ప్రచురించేవారు. సూర్యంగారిని అడిగితే ఇవ్వరని నాకు తెలుసు కాబట్టి, ఓ పుస్తకం ఇవ్వమని, తెలుగులో కథ రాసుకుని ఇస్తానని అడిగితే సూర్యం తమ్ముడు అందుకు ఒప్పుకోలేదు. తన అన్నయ్యకి తెలిస్తే తనని ఇంట్లోంచి పంపించేస్తారని నిరాకరించారు. చివరకి ఒక్కరోజుకి ఓ పుస్తకాన్ని ఇచ్చారు. అందులోని ఓ చిత్ర కథని బలరాంకి తెలుగులో రాసి పంపుతూ 'ఇలాంటివి నెలకి ఒకటి చొప్పున పంపితే శీర్షికగా వేస్తారా?' అని అడిగాను. ఆయన ఓకే అని రాస్తూ మరి కొన్ని పంపమని, తన దగ్గర కొన్ని ఉంటే కాని ఆ శీర్షికని ఆరంభించలేనని జవాబు రాసారు. కొద్ది టైం పడుతుందని, సూర్యం తమ్ముడు సహాయం చేస్తున్నాడని ఉన్నది ఉన్నట్లుగా బలరాంకి ఉత్తరం రాసాను.

అదే సమయంలో ఓసారి నేను విజయబాపినీడుగారి పనిమీద మద్రాస్‌లో ఉన్నప్పుడు అది తెలిసి బలరాం లెటర్ రాసారు. నిర్మాత అట్లూరి పూర్ణచంద్రరావు గారి లైబ్రరీలో కూడా స్క్రీన్ స్టోరీస్ ఉన్నాయని, ఆయన భార్య అట్లూరి హజరాని అడిగితే ఇస్తారని, జెరాక్స్ చేయించుకోవచ్చని. అప్పట్లో ఆమె స్వాతిలో రచనలు చేసేవారు. కానీ నేను వారిని కలవలేదు.

సూర్యం తమ్ముడికి కొన్ని రాత్రులు మందు పార్టీలు ఇచ్చాక వాటిని ఒకదాని తర్వాత ఇంకోటి చొప్పున ఇవ్వడానికి అంగీకరించారు. క్రాస్ రోడ్స్‌లోని సంధ్య థియేటర్ ముందు సిండికేట్ బేంక్ ఉండేది. దాని మేడమీద గల ఓ జెరాక్స్ షాప్‌లో వాటిని ఉదయం ఆఫీసుకి వెళుతూ ఇస్తే సాయంత్రానికల్లా జెరాక్స్ తీసి ఇచ్చేవారు. అలా దాదాపు అన్ని వాల్యూంస్‌ని జెరాక్స్ తీయించి మంచి సినిమా కథలని తెలుగులో రాసి పంపసాగాను. ది విజిట్, ది గ్రేట్ ఎస్కేప్, నైన్ అవర్స్ టు రామా (గాంధీ హత్య మీద తీసిన ఈ చిత్రాన్ని ఇండియా బేన్ చేసింది) మొదలైన చిత్రాల కథలు నెలనెలా స్వాతి మంత్లీలో 1979లో అనుకుంటా రాసాగాయి. కానీ కొన్ని నెలల తర్వాత బలరాం ఆ శీర్షికని నిలిపి వేస్తున్నానని, ఇంక పంపవద్దని ఉత్తరం రాసారు. ఆ తర్వాతి నెలనుంచి మాలతీ చందూర్ గారి ఆంగ్ల నవల పరిచయ శీర్షిక పాతకెరటాలు మొదలైంది. అది ఇంకా కొనసాగుతోంది. బహుశా ఆ నవలలు పాఠకులకి అందుబాటులో ఉండి చదువుతారని, నేను రాసే సినిమాలు వారికి చూడటానికి అందుబాటులో ఉండవని కారణం కావచ్చు. ఏది ఏమైనా నేను నిరాశ చెందాను. వాటిని సంపాదించడానికి నేను పడ్డ శ్రమ వృధా అయింది. జెరాక్స్‌కి నేను పెట్టిన ఖర్చుకూడా పారితోషికంగా రాలేదు. రాసి సిద్ధంగా ఉన్న దాన్ని చింపేసాను. ఆ తర్వాత మళ్ళీ ఎక్కడా వాటిని రాయలేదు.

1980వ దశకంలో మగ రచయితల నవలా ప్రభంజనం మొదలయ్యాక, స్వాతి మంత్లీతో పాటు బలరాం స్వాతి వీక్లీని కూడా తీసుకువస్తున్నారు అని విన్నాను. 1984 మేలో పల్లకి వీక్లీ మొదలైన కొన్ని నెలలకే జులైలో యద్దనపూడి సులోచనారాణి గారి సీరియల్‌తో స్వాతి వీక్లీ మొదలైంది. స్వాతి మంత్లీలో సులోచనారాణి సీరియల్స్ వరసగా వెలువడేవి. స్వాతి వీక్లీ వెలువడ్డ రెండు నెలలకి అనుకుంటా ఓ రోజు డి. ప్రభాకర్ ఫోన్ చేసి తను బలరాం గారితో కలిసి మా ఇంటికి సాయంత్రం వస్తానని, ఇంటికి ఎలా రావాలని దారి అడిగారు.




మంత్లీ పాఠకులు వేరు. వీక్లీ పాఠకులు వేరు. మంత్లీ పాఠకుల అభిరుచి తెలిసిన బలరాం తీసుకువచ్చిన స్వాతి వీక్లీ, భూమిలాంటి సెన్సేషనల్ వీక్లీకి అలవాటు పడ్డ పాఠకులకి నచ్చలేదు. సులోచనారాణి సీరియల్ ఆమె సృష్టించుకున్న పాత తరం పాఠకులకి తప్ప భూమి సృష్టించిన కొత్త తరం పాఠకులకి నచ్చదు. వీక్లీని అధికంగా చదివేది ఈ కొత్తతరం పాఠకులే. బహుశా ఏజెంట్లు నా సీరియల్ లేదా వీరేంద్రనాథ్ సీరియల్ వేయడం సర్క్యులేషన్‌కి మంచిదని సూచించారని నా ఊహ.

ఆ సాయంత్రం ప్రభాకర్, బలరాం మా ఇంటికి వచ్చారు. స్వాతి వీక్లీకి నన్ను సీరియల్ రాయమని బలరాం కోరారు. నేను సిద్ధంగా ఉన్న రెండు థీమ్స్ చెప్పాను. వాటిలో టీనేజ్ లవ్ స్టోరీ కథ వారికి నచ్చడంతో పారితోషికం గురించి అడిగారు. వెంటనే ప్రభాకర్ లేచి బయటకి వెళ్ళిపోయారు. ఎందుకో ఆర్థిక లావాదేవీల బేరసాలప్పుడు ప్రైవసీని కలిగించడం మనం పాటించే సాంప్రదాయం. భూమి, పల్లకి, జ్యోతి వీక్లీ ఒకో సీరియల్‌కి పాతికవేలు ఇస్తున్నారని చెప్పాను. తను ఎన్నడు అంత పారితోషికం ఎవరికీ చెల్లించలేదని ఆయన చెప్పారు. నాకు వారు అంత ఇస్తూండగా తక్కువకి రాస్తే, మిగిలిన ఆ పత్రికలు కూడా నా పారితోషికాన్ని తగ్గించే ప్రమాదం ఉందని, మీది కొత్త పత్రిక కాబట్టి అంత బడ్జెట్ లేకపోతే కొంతకాలం ఆగుదాం అని చెప్పాను. కాని సీరియల్ వెంటనే కావాలని, ఆ మొత్తం ఇస్తానని అంగీకరించారు. ఐతే కనీసం ఇరవై ఆరు సంచికలు రాయాలనే కండిషన్ పెట్టారు. అప్పట్లో సీరియల్స్ పదహారు నుంచి పద్దెనిమిది వారాలు మించి వేసేవారు కారు.

'సీరియల్ బావుందని పాఠకులు అనుకుంటూండగా అది ముగిస్తే పత్రికకి లాభం ఉండదు. సీరియల్ బాగోగులు ఐదారు సంచికలకి పాఠకులకి అర్థం అయిపోతాయి. ఆ తర్వాత అది ఎంతకాలం సాగితే పాఠకులకి, పత్రికకి అంత లాభం.' అని ఆయన చెప్పింది సబబు కూడా.

సీరియల్ టైంకి పంపాలని చెప్పారు. అప్పటికే చాలా సీరియల్స్ వారం వారం రాస్తున్నానని, అంతదాకా ఎవరికీ టైం ఇవ్వకుండా లేనని హామీ ఇచ్చాను. నా కారణంగా సీరియల్ ఆగితే నేను అసమర్థ రచయితని అని పాఠకులు భావిస్తారనే భయం నాలో మొదటి నుంచి ఉండబట్టి ఇప్పటిదాకా ఎన్నడూ నేను సీరియల్‌ని టైంకి అందించని పరిస్థితి రాలేదు. మా మధ్య అంగీకారం కుదిరాక 'సావిరహే' మొదటి సంచిక సీరియల్ రాసాను. వెంటనే ఏ కారణంగానో విజయవాడ వెళ్ళాల్సి రావడంతో, మొదటి సంచికని నేను వ్యక్తిగతంగా సూర్యారావు పేటలోని వారి కార్యాలయానికి తీసుకెళ్ళి బలరాంకి ఇచ్చాను. బలరాం నాకు తన బల్ల డ్రాయర్ లోంచి ఓ ఉత్తరాన్ని తీసి చూపించారు. అది నేను మొదటిసారి వారి ఆఫీసులో ఆదివిష్ణుతో కలిసి ఆల్కహాల్ తీసుకుని హైదరాబాద్ తిరిగి వచ్చాక రాసిన థాంక్స్ ఉత్తరం. స్వాతి మంత్లీ అభివృద్ధిమీద ఆ ఉత్తరంలో అనేక సూచనలని చేసాను. అందులోని ఒకటి బయటకి చదివారు.

స్వాతి మంత్లీకి వచ్చే మొత్తం రచనల బరువు, స్వాతి మంత్లీ బరువు ఇస్తూ మంచి కథలని ఎంపిక చేయడానికి సంచికకి ఎన్ని రెట్లు బరువుగల వ్రాత ప్రతులని చదివి మంచి కథలని ఎంపిక చేస్తున్నారో పాఠకులకి చెప్పడం. ఆ ఉత్తరం ఆయన అంత శ్రద్ధగా దాచి ఉంచి తర్వాత నాకు చూపించడం కించిత్ ఆశ్చర్యాన్ని కలిగించింది. ఆయనకి ఏ కాగితం, ఉత్తరం పారేయకుండా దాచే అలవాటు ఉందని కూడా నాకు అర్థమైంది.

అలా స్వాతి వీక్లీలో నా మొదటి సీరియల్ ఆరంభమైంది. దాని పేరు 'సావిరహే'. 'సావిరహే'ని పాఠకులు బాగా ఆదరించడంతో కమర్షియల్ రచయితగా నా మీద బలరాంకి నమ్మకం కుదిరింది. అంతదాకా నన్ను బలరాం కథా రచయితగానే పరిగణించారు. నన్ను స్వాతి మంత్లీకి కథలు తప్ప సప్లిమెంటుకి నవల కాని, సీరియల్ కాని రాయమని ఎన్నడూ అడగలేదు.

మొదట్లో బలరాం సీరియల్ కథని నేను తనతో చర్చించాలనే కోరికని వ్యక్తం చేసారు.

"మీకు, పాఠకులకి మధ్య నేను కేవలం పోస్ట్‌మేన్‌గా ఉండిపోకూడదు. సీరియల్ విషయంలో నేను పార్టిసిపేట్ చేయాలని అనుకుంటున్నాను."

ఐతే నేను స్థూలంగా ఓ కథని చెప్పగలను. కాని సంఘటనలని, సన్నివేశాలని అన్నిటిని చెప్పలేను. చాలా భాగం రాస్తూండగా తడుతూంటాయి. ఐతే నా రెండో సీరియల్ 'మిస్టర్ వి'ని కూడా పాఠకులు విశేషంగా ఆదరించాక బలరాం నేను పాఠకులని రంజింప చేసే సీరియల్స్ రాయగలనని, తన ప్రమేయం అవసరం లేదని గ్రహించారు. ఆ తర్వాత ఇలా అనేవారు.

'సీరియల్ బావుంటే మీకు పేరొస్తుంది. లేదా పాఠకులు మిమ్మల్నే తిడతారు తప్ప నన్ను కాదు. ఎలా రాస్తారో మీ ఇష్టం"

మొదట్లో స్వాతి తమ పోటీ పత్రికగా ఆంధ్రజ్యోతి వీక్లీని భావించింది. ఆంధ్రప్రభ, పల్లకి, మయూరి ఆంధ్రసచిత్ర వార పత్రిక స్వాతికి ఏనాడు పోటీ కాలేదు. ఆ నాటి లార్జెస్ట్ సర్క్యులేటెడ్ వీక్లీ భూమి ధోరణిని అనుసరించకుండా స్వంత బాణీతో స్వాతి ఎదగడం విశేషం. వీక్లీలో చింపుకునేందుకు వీలుగా వేసిన 'సరసమైన కథ' శీర్షికన ప్రచురించిన శృంగార కథల వల్ల, వాటికి జయదేవ్ సహకారంతో మద్రాసుకి చెందిన జే అనే ఓ చిత్రకారుడు గీసిన శృంగార బొమ్మల వల్ల స్వాతి సర్క్యులేషన్ బాగా పెరిగింది. తీవ్ర విమర్శ వచ్చాక బలరాం ఆ శీర్షిక తీవ్రతని పలచ పరిచారు.

'మిస్టర్ వి' అనే స్వాతి వీక్లీలో వచ్చిన నా సీరియల్‌ని మహాలక్ష్మి బుక్ ఎంటర్ ప్రైజెస్ అధినేత నర్సింహ యోగి ప్రచురించారు. అప్పట్లో రేడియోలో వివిధభారతిలో అరగంట వ్యాపార ప్రకటన చవకలో లభ్యం అయ్యేది. క్రియేటివ్ కమర్షియల్ అనే (నేటి చిత్ర నిర్మాత కె.యస్.రామారావు దాన్ని నడిపేవారు) ప్రకటన ఏజన్సీ ద్వారా 'మిస్టర్ వి' నవల ప్రకటనని రేడియోకి ఇచ్చాం. అందులో నేను, యోగి కాక దాన్ని ప్రచురించిన బలరాంగారి చేత కూడా మాట్లాడించాం. 'మీరు చాలా బాగా మాట్లాడారు' నేను బలరాంని అభినందిస్తే, పూర్వం తను స్టేజ్ డ్రామాల్లో నటించానని చెప్పారు. అది రేడియోలో ప్రసారం అయ్యాక ఎవరో ప్రత్యర్థులు ఆ ప్రకటన మీద ఫిర్యాదు చేయడం వల్ల రేడియోలో దాని ఇన్‌ఛార్జ్‌కి అధికారులు మెమో ఇచ్చారు. ఒకే ప్రకటనలో మూడు వ్యాపార సంస్థల పేర్లు ఎలా అనుమతించారు? అని. నియమం ప్రకారం ఒక్కరి పేరే రావాలిట. దాన్ని బుక్ చేసుకున్న మహాలక్ష్మి బుక్ ఎంటర్ ప్రైజెస్ పేరు రావడం ఓకే. నా పేరు రావడం అభ్యంతరకరం అయింది. నా పేరుని కూడా వ్యాపార సంస్థగా లెక్కవేసారు. అలాగే స్వాతి వీక్లీ పేరు రావడం కూడా అభ్యంతరకరంగా వారికి తోచింది. త్వరలోనే ఆ ప్రకటనా సమయాన్ని రేడియో వారు పూర్తిగా రద్దు చేసేసారు.

సావిరహే, మిస్టర్ వి, అందమైన జీవితం, శనివారం నాది, ది గెస్ట్, పాణిగ్రహణం, యమపాశం, మిస్టర్ నో మొదలైన నవలలు నావి స్వాతి వీక్లీలో వచ్చాయి. ఐతే బయట పత్రికల్లో పాపులర్ అయిన పేరుగల నా సీరియల్స్‌ని వేస్తున్నారని తన గురించి ఎవరైనా అనుకుంటారనే భయం బలరాంలో ఉందని నా అనుమానం. ఎందుకంటే స్వాతిలో రాబోయే నా సీరియల్ ప్రకటనలో బలరాం ఇలా రాశారు.

'ఇది చెట్టు పేరు చెప్పి కాయలు అమ్ముకోవడం కాదు.'

కాని బలరాం నాతో సహా బయట పాపులర్ అయిన సీరియల్ రచయితల సీరియల్స్ వేసారు. అంతే తప్ప స్వాతి నుంచి కొత్త రచయితలని తయారు చేసారని నేను భావించడంలేదు. సూర్యదేవర రామ్మోహన్ రావు, చల్లా సుబ్రమణ్యం, సువర్ణాకన్నన్, మొదలైన వారి సీరియల్స్‌నే ఆయన వేసారు. వీరి మొదటి సీరియల్స్ జ్యోతి, పల్లకి, భూమి, మయూరి లాంటి ఇతర వీక్లీలలోనే ప్రచురింపబడ్డాయి.

పాకెట్ బుక్స్ ద్వారా పాపులర్ అయిన మధుబాబువి వేసారు. బహుశ కొత్త రచయితలతో రిస్క్ తీసుకోదలచి ఉండరు. అలా అని ఆయనది రిస్క్ తీసుకోని పద్దతా అంటే, అదీ కాదనే చెప్పాలి.

ఉదాహరణకి 'అందమైన జీవితం' అనే నవల థీమ్‌ని చెప్పి, అది మంచి నవల అవుతుంది తప్ప పాఠకులంతా మెచ్చే నవల కాకపోవచ్చని, ఎందుకంటే దాంట్లో పాఠకుడ్ని వారం వారం నిలబెట్టే ఉత్కంఠగల పాయింట్ లేదని చెప్పాను. బలరాం 'రాయండి. అలాంటిదీ ఒకటి వేసి చూద్దాం' అని ప్రోత్సహించకపోతే అది బహుశా నేను తర్వాత రాసేవాడ్ని కానేమో. మధ్యతరగతి పాత్రలతో సాగే ఇద్దరు వివాహితుల మధ్య గల అమలిన స్నేహం ఇతివృత్తంగా గల ఆ సీరియల్ పాఠకుల్ని విశేషంగా ఆకర్షించడమే కాక నా బెస్ట్ సెల్లర్ జాబితాలో మొదటి నవల అయింది (ఇప్పుడు జయం దాని స్థానాన్ని ఆక్రమించుకుంది) నేను స్వాతి వీక్లీకి రాసిన ఏ సీరియల్ కూడా పాఠకులకి నచ్చని విధంగా రాయలేదనే విశ్వసిస్తున్నాను. సీరియల్ బాగా లేదని పాఠకులు అనుకుంటున్నారనే ఫిర్యాదు ఏ విషయంలోనైనా నిర్మొహమాటంగా, ఖచ్చితంగా ఉండే బలరాం నుంచి నాకు ఎన్నడూ రాలేదు.

ఓసారి బలరాంని యండమూరి వీరేంద్రనాథ్ సీరియల్స్ ఎందుకు వేయడం లేదని అడిగాను.

"మా ఊరు అమ్మాయి ఆత్మహత్యకి కారణం అయిన అతని పేరు నేను బ్రతికుండగా స్వాతి తల్లి వీక్లీలో రాదు." ఆవేశంగా చెప్పారు.

నేను విజయవాడ వెళ్ళినప్పుడల్లా ఓ సాయంత్రం విధిగా బలరాం గారిని కలిసేవాడిని. బలరాం మనస్థత్వం ఎవరితో పెద్దగా కలవకపోవడం, తన పని, తాను తప్ప ఇతర విషయాలని పట్టించుకోకపోవడం. తను గీసుకున్న గిరిని దాటి బయటకి వచ్చేవారు కారు. ఇతర పత్రికలని కూడా పెద్దగా తిరిగేసేవారు కారు. నేను ఏ పత్రిక ఆఫీసుకి వెళ్ళినా ఒక్క రచయిత అయినా కనపడతారు. కాని బలరాం దగ్గరకి వెళ్ళినప్పుడు వారి దగ్గర ఒక్క రచయిత కూడా నాకు తారసపడలేదు.

నా సీరియల్స్ స్వాతి వీక్లీ సర్క్యులేషన్‌కి దోహదం చేసేవి. అందుకే రెండు వారాల గేప్‌తో స్వాతి వీక్లీలో నా సీరియల్స్ వరసగా వచ్చాయి. స్పష్టంగా తెలీదు కానీ ఆ కారణంగానో లేదా వ్యక్తిగతంగా నేను నచ్చో బలరాం, నేను కలిసి డ్రింక్ తీసుకునే వారం. కేవలం తను ఆంతరంగికులు అనుకునే వారినే ఆయన ఈ విషయంలో దగ్గరకి రానిచ్చేవారు. బయట బార్‌కి రావడానికి ఇష్టపడేవారు కారు. ఒకే ఒక్కసారి ఈగిల్ బార్ అండ్ రెస్టారెంట్ అనే బార్‌కి వెళ్ళాం. ఆ రోజు నవభారత్ బుక్ పబ్లిషర్స్ అధినేత ప్రకాశరావుగారు కూడా వచ్చారు. వీరేంద్రనాథ్ నవలలని ప్రకాశరావు గారు ప్రచురించేవారు. ఆయనకి వీరేంద్రనాథ్ సీరియల్స్ స్వాతిలో వేయడంలేదని బలరాం మీద కోపంగా ఉండేదని వారి సంభాషణని బట్టి నాకు అర్ధమైంది.

మేం బలరాం ఇంట్లోకాని, ఆఫీసులో కాని కూడా డ్రింక్స్ తీసుకునే వారం కాదు. ఆయన ఇంటికి, బయట కాంపౌండ్ వాల్‌కి మధ్యగల చిన్న సందులో తీసుకునేవారం. డ్రింక్ తీసుకున్నాక ఆయనలో ఆవేశం అధికం అయ్యేది. ఓ రోజు మహలక్ష్మి బుక్ ఎంటర్ ప్రైజెస్ పార్టనర్ కాశీ తన అంబాసిడర్ కారులో నా దగ్గరకి ఇంటి దగ్గర డ్రాప్ చేయడానికి బలరాం ఇంటికి నేను చెప్పిన టైంకి వచ్చారు. బలరాం ఆ కారు ఎక్కారు. మంగళగిరి దాకా బలరాం గారి కోరిక మీద వెళ్ళివచ్చాం. మర్నాడు కలిస్తే కాశీ ఫోన్ నంబర్ అడిగి తీసుకుని ఫోన్ చేసి క్షమించమని కోరారు. అదీ వారి వ్యక్తిత్వంలోని ఓ మంచి కోణం.

'మిమ్మల్ని రాత్రి ఇబ్బంది పెట్టానా?' అని అడిగారు. కాని ఎప్పుడూ ఆయన నన్ను ఇబ్బంది పెట్టలేదు. స్థబ్ధుగా కూర్చోడానికి డ్రింక్ తీసుకోవడం దేనికి? ఐనా మిత్రులు ఇబ్బంది పెట్టాలన్నా ఎలా పెట్టగలరు? వారు చేసేవన్నీ వారిలా మనకీ ఆ సమయంలో ఆనందాన్నిచ్చేవిగానే ఉంటాయి. మొత్తం ఐదారుసార్లు మాత్రమే డ్రింక్స్ దగ్గర మేం కలిసి ఉంటాం.

ఓసారి 'సూపర్ రైటర్' శీర్షికని ప్రకటించారు. అందులో నా పేరు మరికొందరు రచయితల, రచయిత్రుల పేర్లు సూచించారు. తర్వాతి వారమే పాఠకులు ఎవరిపేరు ఎంపిక చేసారో వచ్చేది. ఆ రాత్రి మేం మందు మీద ఉండగా అడిగారు.

"సూపర్ రైటర్ ఫలితం గురించి మీరు నన్ను ఇంతదాకా అడగలేదే?"

"పాఠకులు ఎవర్ని నిర్ణయిస్తే మీరు ఆ పేరు ప్రకటిస్తారు. మీకు ఇష్టం వచ్చినవారి పేరుకి దాన్ని ఆపాదించడం, అలా మీ పాఠకులని మోసం చేసే స్వభావం కాదు మీది. వారపత్రికలో వచ్చాక చూడచ్చని అడగలేదు" చెప్పాను.

అప్పటికే ఆ సంచిక ప్రెస్‌కి వెళ్ళినా ఆయన ఆ ఫలితం చెప్పలేదు. తర్వాతి వారం స్వాతిలో సూపర్ రైటర్ పాఠకులు నా పేరుని ఎన్నుకున్నారని చదివాను. నాకు కాక ఇంకెవరికైనా అది లభించినా నేను బాధపడటం కాని, ఆయన్ని తప్పు పట్టడం కాని చేసేవాడిని కాను. ఆయనలో గల నిబద్ధత అంటే నాకు ఎంతో గౌరవం. చేసే పని విషయంలో ఇలాంటి నిబద్ధత గల వారు చలసాని ప్రసాదరావు గార్ని ఒక్కర్నే చూసాను.

బలరాం స్వాతి వీక్లీని ఆంధ్రపత్రిక ప్రెస్‌లో అచ్చువేసేవారు. ఆయన ఓసారి పత్రిక అధినేత శివలెంక రాధాకృష్ణని మెచ్చుకుంటూ చెప్పారు.

"తన పత్రిక్కి పోటీ పత్రికే అయినా స్వాతిని తన ప్రెస్‌లో ప్రింట్ చేయడం ఆయన గొప్పతనం. అంతేకాదు. మొదట స్వాతి అచ్చయ్యాకే వాళ్ళ పత్రిక ప్రింటింగ్‌కి వెళుతుంది. తన పత్రిక పెరగకుండా, పైగా స్వాతి సర్క్యులేషన్ ప్రింట్ ఆర్డర్ వారం వారం పెరుగుతున్నా ఆయనలో అసూయ కాని, ఎక్కడా ఏ విషయంలో తేడా కానీ రాలేదు. ఎన్నడూ స్వాతి ప్రింటింగ్‌ని ఏదో వంకతో ఆపలేదు."

తర్వాత సూర్యారావు పేటలోనే స్వాతి బిల్డింగ్‌కి కొద్ది దూరంలో ఉన్న ఇంకో భవంతిలో బలరాం స్వంత ప్రెస్‌ని ఏర్పాటు చేసుకున్నారు. ఆ ప్రెస్‌ని ఇన్‌స్టాల్ చేస్తూండగా 1990లో అనుకుంటా ఓసారి తీసుకెళ్ళి చూపించారు. ఆనాడు స్వాతి శివలెంక రాధాకృష్ణని అడిగినట్లుగా స్వాతి ప్రెస్ లో తమ వార పత్రికని ప్రచురించమని ఇంకో పత్రిక యాజమాన్యం కోరితే ఇప్పుడు బలరాం ఒప్పుకుంటారా? అనుమానమే. జ్యోతి వీక్లీకి ఎడిటర్‌గా వ్యవహరించే తోటకూర రఘు తరచు బలరాంని కలిసేవారు.

అప్పట్లో నేను ఆర్నెల్లకి ఓసారి అమీర్ పేట్‌లోని నేచర్ క్యూర్ హాస్పిటల్‌లో బరువు తగ్గాలని ఓ రెండువారాలు చేరేవాడిని. ఓసారి నేను అక్కడ ఉండగా బలం విజయవాడలోని తన ఆఫీస్‌కి ఫోన్ చేసి ఆరోజు విశేషాలని అడిగి తెలుసుకుని తగిన సూచనలని ఇవ్వడం చూసాను. ఓ కాగితం మీద రాసుకున్న పాయింట్లు ఆయన దగ్గర సిద్ధంగా ఉండేవి.

"మీది దిన పత్రిక కాదు కదా? దేనికీ రోజూ ఎస్‌టిడి చేసి మాట్లాడటం?" అడిగాను నేను.

"అక్కడ నేను ఉంటే జరిగేదంతా ఎలా తెలుస్తుందో అలా ఫోన్ ద్వారా తెలుసుకుంటాను. ఏ పని పెండింగ్ ఉన్నా నాకు తోచదు. ఏ రోజు పని ఆ రోజు పూర్తి చేయాల్సిందే. ఇందుకు నేను తరచు స్టాఫ్‌కి ఓవర్ టైం కూడా చెల్లించి చేయిస్తూంటాను."

స్టాఫ్ తప్పు చేస్తే ఆయన సహించరు. ఓసారి చెప్పారు.

"ఉద్యోగం ఇచ్చే రోజే చెపుతాను, తప్పు చేసినప్పుడు నేను తిడితే సహించేట్లయితేనే చేరండి. లేదా వద్దు అని."

ఆయన స్టాఫ్‌ని బాగా చూసుకునేవారు. వారికి ఉచిత వైద్య సౌకర్యం కల్పించారు. ఓసారి ఎవరో చెప్పారు తన సిబ్బందిలోని ఒకరికి 1990 ల్లోనే వైద్య చికిత్సకి లక్షరూపాయలు ఖర్చు చేసారని. ఏ పెట్టుబడిదారు చేయని గొప్పకార్యం ఇది.

అమెరికాలో పక్కపక్కనే కూర్చునే ఉద్యోగస్తులు ఒకరితో మరొకరు పనికి సంబంధించిన విషయాలని మాట్లాడకూడదనే నియమం ఉంది. అది ఇండియాలో నేను గమనించింది ఒక్క స్వాతి వీక్లీ కార్యాలయంలోనే. ఎంతో నిశ్శబ్దంగా, ఏకాగ్రతతో స్వాతి వీక్లీ ఉద్యోగులు తోటివారితో ఉబుసుపోక కబుర్లు చెప్పుకోకుండా తమ పనిమీదే లగ్నం అయి ఉండటం నేను అనేకసార్లు గమనించాను. అది బలరాం ఏర్పరిచిన క్రమశిక్షణ ఫలితం.

నా సీరియల్స్ వేస్తున్నప్పుడు వాటిని ప్రెస్‌లో ప్రచురణకి ఇవ్వడానికి ఆర్ట్‌పుల్‌ని పంపమని బలరాంని కోరాను. (తెల్లకాగితం మీద ప్రకటనలు లేకుండా వరసగా సీరియల్ మొత్తాన్ని ముద్రించిన కాగితాన్ని ఆర్ట్‌పుల్ అంటారు) స్వాతి వీక్లీలో ప్రకటనలు, బాక్స్ ఐటమ్స్ మధ్య గల సీరియల్ బదులు ఆర్ట్‌పుల్‌లోని మేటర్ నవలని ముద్రించే ప్రెస్‌లో కంపోజింగ్ చేసేవారికి సౌకర్యంగా ఉంటుంది. క్రమం తప్పకుండా స్వాతి నించి అవి అందేవి. ఓ ఉద్యోగికి ఆ బాధ్యతని అప్పచెపితే మిగిలిన పత్రికా సిబ్బంది నిర్లక్ష్యంగా ఉంటారు కాని స్వాతి వీక్లీలో అలా ఉండరు. ఇందుకు కారణం బలరాం పర్యవేక్షణ, క్రమశిక్షణ. మేం మాట్లాడుకుంటూంటే ఎన్నో సార్లు పోస్ట్ చేయాల్సిన కవర్లని తెచ్చి ఆయనకి చూపించడం గమనించాను. ఆయన వాటిని చూసి తల ఊపాక పోస్ట్‌కి వెళ్ళేవి.

"ఎందుకు వాటిని మీరు చూసి కాని పోస్టు చేయరు?" ఓ సారి అడిగాను.

"స్టాంపులు కుడివైపు అడ్రస్ పైన, పోస్టాఫీసులో కొట్టే కేన్సలేషన్ ముద్ర అడ్రస్ మీద కనపడకుండా పడేలా కాకుండా అతికించాలి. తలకిందులుగా కాకుండా, వంకర టింకర లేకుండా స్టాంప్‌ని నీట్‌గా అతికించాలి. అడ్రస్ టైప్ చేసినప్పుడు కొట్టివేతలు ఉండకూడదు. స్వాతి ఫ్రం అడ్రస్ ఆ కవర్ మీద సరిగ్గా ముద్రించబడిందో లేదో చూసుకోవాలి. మన కవరు మన సంస్థని, మన సంస్థ పని తీరుని రిప్రజెంట్ చేస్తుంది. గమ్యం చేరే దారిలో ఎందరో మనం కవరుని చూస్తారు. కాబట్టి చెక్ చేస్తూంటాను."

ఇందాక నిబద్ధత అనే పదం వాడాను. దాని అర్థం ఇలాంటి చర్యలే. ఏ వ్యాపారస్థుడిలో ఇలాంటి సూక్ష్మమైన జాగ్రత్త ఉంటుంది? అందుకే స్వాతి అచ్చుతప్పులు లేకుండా అంత సుందరంగా వెలువడుతోంది.

*(మిగిలిన విశేషాలు వచ్చేనెల)*

Click here to share your comments on this article